క్లుప్తంగా

సమయానికి విధులకు హాజరుకావాలి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు

విజయనగరం: సమయానికి విధులకు హాజరుకావాలని సచివాలయ సిబ్బందికి నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు సూచించారు. స్థానిక ఫూల్‌బాగ్ కాలనీలోని రెండో సచివాలయాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు పరిశీలించి, ప్రజలకు అందించే సేవలపై ఆరా తీశారు. ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు నిరంతరం కృషి చేయాలని కోరారు.

రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం



రోడ్డు నిర్మాణానికి వేసిన గ్రావెల్

పూసపాటిరేగ: మండలంలోని చోడమ్మ అగ్రహారం, కొవ్వాడ అగ్రహారం గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు అదనంగా కొవ్వాడ గ్రామ సర్పంచ్ అందించిన రూ.20 లక్షలు కలిపి 2.5 కిలోమీటర్ల పొడవునా 40 అడుగుల వెడల్పు మేర నిర్మాణం చేస్తున్నారు. ఈ రోడ్డు పూర్తయితే ఆయా గ్రామాల మధ్య వ్యవసాయ భూముల నుంచి పంటల రవాణా సులభతరమవుతుంది.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంపీపీ కల్యాణి

పూసపాటిరేగ: మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ సభ్యురాలు మహంతి కల్యాణి శనివారం ప్రారంభించారు. వేసవి ఎండల నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు నిర్వహిస్తున్న ఈ చలివేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు. అనంతరం పలువురికి మజ్జిగ, నీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో వెంకట్రామన్, ఎంపీడీవో ఎం.రాధిక, సూపరింటెండెంట్ వైఎస్సార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం గంటస్తంభం: స్థానిక నిత్యాన్నదాన క్షేత్రంలో స్వర్గీయ కాండ్రేగుల రామారావు పేరిట ఆయన కుమారుడు కాండ్రేగుల శేఖర్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ శనివారం ప్రారంభించారు. నిత్యాన్నదానం వద్ద దాత ఏర్పాటు చేసిన కూలింగ్ ఫిల్టర్ వాటర్ క్యాన్‌ను సద్వినియోగం చేసుకోవాలని బాబ్జీ కోరారు.


ఆరోగ్య తనిఖీలు



శిబిరం వద్ద వృద్ధుడి బీపీ తనిఖీ చేస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండగుంపాం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. సర్పంచ్ పతివాడ అప్పన్న, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య తనిఖీలు నిమిత్తం శిబిరానికి హాజరైన వారికి వైద్య సిబ్బంది రోగుల ఆరోగ్యం తనిఖీ చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అంతకుముందు గ్రామంలో పలుచోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తవుడు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

నెల్లిమర్ల: మండలంలోని జరజాపుపేటలో హెచ్‌ఐవీ(హ్యూమన్ ఇమ్యునో వైరస్) నిర్మూలనపై శనివారం అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ సోకుతుంది..తద్వారా ఎయిడ్స్(అక్వైర్డ్ ఇమ్యునో డెఫిషియన్సీ సిండ్రోమ్) ఏ విధంగా వస్తుందన్న విషయాలను సీహెచ్‌సీ వైద్య సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ ఎం.తవుడు పాల్గొన్నారు.

విచారణ

గంట్యాడ: మండలంలోని పెదవేమలికి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ వి. శ్రీనివాసరావుపై శనివారం విచారణ చేపట్టారు. ఉపాధి వేతనదారులకు పని కల్పించడం లేదని సర్పంచ్ వి. పాపునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదవేమలి సచివాలయంలో ఏపీఓ గర్భాపు సుందరరావు విచారణ చేపట్టారు. విచారణ నివేదికను డ్వామా పీడీకి పంపిస్తామని ఆయన తెలిపారు.

సమస్యలు ఏకరువు

- మండల సమావేశం దృష్టికి ప్రజాసమస్యలు
- సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంపై సభ్యుల మండిపాటు
- పదేపదే చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధారాణి

నెల్లిమర్ల: మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మండల సమావేశంలో పలువురు సభ్యులు ఏకరువు పెట్టారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అంబల్ల సుధారాణి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలు శాఖల పనితీరు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ ప్రాంతాల్లో నెలకొన్న ప్రజాసమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. గొర్లిపేటలో వీధి దీపాలకు ఏవీ స్విచ్ లేదని, ఏర్పాటు చేయాలని సర్పంచ్ పరిశినాయుడు విద్యుత్ శాఖ ఏఈని కోరారు. అలాగే గరికపేటలో పాడైన విద్యుత్‌స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు వేయాలని సర్పంచ్ గుంటమాని ఉమామహేశ్వరరావు విన్నవించారు.

చేతికందేలా కరెంట్ తీగలు..

గుషిణి పొలాల్లోని విద్యుత్‌తీగలు చేతికందినంత ఎత్తులో వేలాడుతున్నాయని, ఈ సమస్యను ఇప్పటికే పలుమార్లు తెలియజేసినా పరిష్కారానికి ఎవరూ ముందుకురాలేదని ఎంపీటీసీ సభ్యురాలు చనమల్లు స్వాతి ఏఈకి తెలిపారు. పశుసంవర్ధక శాఖపై జరిగిన చర్చలో వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం, బొప్పడాం సర్పంచ్ అంబల్ల కిరణ్‌లు.. పంచాయతీ తీర్మానం లేకుండా గోశాలలు మంజూరు చేయొద్దని వైద్యులకు తెలిపారు. అనంతరం మరికొన్ని శాఖల ప్రగతి నివేదికలను అధికారులు వెల్లడించగా, సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎంపీపీ ఆదేశించారు. ఆ తర్వాత స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. సమావేశంలో తహసీల్దారు డీవీ రవిశంకర్, కార్యాలయ ఏవో సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ విద్యార్థుల అభ్యున్నతికి కృషి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రీకాంత్ తదితరులు

విజయనగరం టౌన్: బ్రాహ్మణ విద్యార్థుల అభ్యున్నతికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ డీవీ శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని గాయత్రి భవన్‌లో విద్యార్థుల ప్రతిభా పురస్కారాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. జూలై 13న రింగురోడ్డు జ్ఞాన సరస్వతీ ఆలయ ప్రాంగణంలో నిర్వహించే కార్యక్రమంలో ఈ ఏడాదికి సంబంధించిన పురస్కారాలను విద్యార్థులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు పీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

• స్వచ్ఛతే లక్ష్యం

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, వైద్యారోగ్య సిబ్బంది అంతా కార్యక్రమంలో పాల్గొని, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలని కోరారు. అనంతరం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

– విజయనగరం, నెల్లిమర్ల నెట్‌వర్క్



నెల్లిమర్ల: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని, కమిషనర్ తారక్‌నాథ్



విజయనగరం ఫోర్ట్: ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



డెంకాడ: మోపాడ పీహెచ్‌సీ ఆవరణంలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ వాసుదేవరావు



విజయనగరం గంటస్తంభం: ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా పర్యాటక శాఖాధికారి కుమారస్వామి తదితరులు



విజయనగరం: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తదితరులు



విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాలలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్ సునీత, తదితరులు



విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

• సర్వేతో అవస్థలు



సర్వే కోసం వేచి చూస్తున్న మహిళలు

నెల్లిమర్ల రూరల్: స్థానిక పీఏసీఎస్ వద్ద సిబ్బంది చేసిన సర్వేతో మహిళలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఏసీఎల్పీ సర్వేకు సంబంధించి, డ్వాక్రా గూపు మహిళల వివరాలను బుక్ కీపర్లు నమోదు చేస్తున్నారు. శనివారం జరిగిన ఈ సర్వేలో సదరు మహిళల ఈకేవైసీ వేయాల్సి ఉండగా, ఆ యంత్రం మొరాయించింది. దీంతో గంటల తరబడి మహిళలు వేచి చూడాల్సిన పరిస్థితి. మధ్యాహ్నం 12 గంటల నుంచి కొన్ని గంటల పాటు ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డామని పలువురు మహిళలు వాపోయారు. దీనిపై ఏపీఎం సురేష్ స్పందిస్తూ రోజులో 10 గ్రూపుల సభ్యుల వివరాలు మాత్రమే సర్వే చేయాలని వీవోఏలు, సీసీలకు చెప్పామన్నారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సన్యాసినాయుడు

డెంకాడ: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలంతా సహకరించాలని ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు కోరారు. మండలంలోని చొల్లంగిపేట, నగరపుపేట, రెడ్డికపేట, ఆర్.ముంగినాపల్లి గ్రామాల్లో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, శాంతిభద్రతల వైఫల్యం వల్ల కలిగే అనర్థాలు శనివారం వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని, మత్తు పదార్థాల విక్రయం ప్రోత్సహించకూడదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం బెల్టుషాపులు నిర్వహించినా సమాచారం ఇవ్వాలన్నారు. వాహనదారులంతా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, మైనర్లు వాహనాలు ఇవ్వవద్దని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

వేతనదారులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న ఉపాధ్యాయుడు బంగారయ్య

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న వేతనదారులకు అదే గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శివ్వకు బంగారయ్య శనివారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వేసవి ఎండల నేపథ్యంలో వేతనదారులకు ఉపశమనం కలిగేలా మొత్తం 360 మందికి చల్లని మజ్జిగ అందజేసినట్లు ఆయన తెలిపారు. సెలవు రోజుల్లోనూ ప్రజలకు ఎంతో కొంత సేవ చేయాలని చూస్తున్న ఆయన తపనను వేతనదారులు అభినందించారు.

• సీపీఎస్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న శంకరరావు

పూసపాటిరేగ: తక్షణమే సీపీఎస్ రద్దు చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా పరిశీలకుడు వై.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భోగాపురం తాలూకా హెల్త్ ఉద్యోగుల సమావేశం శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ జూన్ 5వ తేదీన జరగబోయే రాష్ట్ర స్థాయి సమావేశానికి పెద్దఎత్తున ఉద్యోగులు తరలిరావాన్నారు. డీఏ బకాయిల చెల్లింపు, ఐఆర్ ప్రకటింపు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జె.ఉమామహేష్‌కుమార్, రాజేష్‌వర్మ, సుధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22న చల్లదన మహోత్సవం

విజయనగరం టౌన్: స్థానిక కొత్తపేటలో కొలువైన మరిడమ్మ, ముత్యాలమ్మ, బంగారమ్మల చల్లదన మహోత్సవం ఈ నెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా ఆరోజు ఉదయం 6 గంటలకు కొత్తపేట బంగారమ్మ చదురు వద్ద ఘటాలకు పూజలు, 7 గంటలకు మేళతాళాలు, సాముగరిడీలు, శక్తి వేషాలతో ఊరేగింపు, 11 గంటలకు ఆలయం వద్ద మజ్జిగ పంపిణీ, మధ్యాహ్నం 3:30 గంటలకు ముత్యాలమ్మ ఘటాభిషేకం, ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందన్నారు.

కక్ష సాధింపు తగదు

నెల్లిమర్ల రూరల్: విశ్రాంత ఐఏఎస్ అధికారులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడాన్ని ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శనివారం ఖండించారు. ప్రజలకు మంచి చేస్తారని ఓట్లు వేసి గెలిపిస్తే ప్రజాపాలనను గాలికి వదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేయడం సిగ్గుచేటన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, ఐఏఎస్ స్థాయి అధికారులను టార్గెట్ చేసుకుని మరీ లేనిపోని తప్పుడు కేసులతో వేధిస్తూ శునకానందం పొందుతున్నారన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని, వారే సమయం చూసి తగిన బుద్ధి చెబుతారన్నారు.

అన్నదానం

విజయనగరం: స్థానిక పట్టణంలోని ప్రదీప్‌నగర్‌లో ఉన్న వెంకటసాయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పట్టణానికి చెందిన పువ్వాడ మనోజ్‌కుమార్ శనివారం అన్నదానం చేశారు. ఆయన తల్లి పువ్వాడ కృష్ణవేణి 60వ పుట్టినరోజు వేడుకలు ఆశ్రమంలోనే చేసి, వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం భోజనాలు పెట్టారు. అలాగే ఆస్తమాతో బాధపడుతున్న కేఎల్ పురానికి చెందిన వ్యక్తికి ఆక్సిజన్ మిషన్ సమకూర్చారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

డెంకాడ: మండలంలోని ఏపీఎస్పీ బెటాలియన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు ఈ నెల 19వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చింతలవలస, ఏపీఎస్పీ బెటాలియన్, రఘుమండ, గుండాలపేట, బొడ్డవలస, కృష్ణాపురం, వెలంపేట, గెద్దవానిపాలెం, జొన్నాడ, ఆకులపేట, డి.తాళ్లవలస, దువ్వపేట, సత్యనారాయణపురం గ్రామాలతో పాటు చెల్లూరు ఇండస్ట్రియల్ ఫీడర్‌కు కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

విజయనగరం క్రైమ్: మండల పరిధిలోని అంబటివలస గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ అశోక్ శనివారం తెలిపారు. సదరు మహిళ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నంబరు 9121109441ను సంప్రదించి సమాచారం ఇవ్వాలన్నారు.

యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోండి

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురంలో గల సత్యసాయి కల్యాణ మంటపంలో పది రోజులు ధ్యాన, ఆరోగ్య యోగా శిక్షణ శిబిరం నిర్వహించనున్నామని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు సూరి గురూజీ ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఈ నెల 19 నుంచి పది రోజులు శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 7 వరకు.. సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ సమయంలో అమృత ఆహారం అందించనున్నట్లు పేర్కొన్నారు.

శిక్షణ శిబిరాలతో విజ్ఞానం

- ఎంపీడీఓ ఎంవీజీ సుబ్రహ్మణ్యం



చిన్నారులకు సూచనలు అందిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ, తదితరులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): వేసవికాలంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలు విజ్ఞానానికి దోహదం చేస్తాయని ఎంపీడీఓ ఎంవీజీ సుబ్రహ్మణ్యం అన్నారు. గరివిడి శాఖా గ్రంథాలయంలో శనివారం సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఎం. ఉషారాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు బీట్ ద హీట్ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. విద్యార్థులు తరుచుగా క్విజ్ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. వేసవికాలంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పి.రామారావు, ఏపీఎం పి.నారాయణరావు, ఏపీఓ కనకరాజు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు పాపారావు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

- డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీరాణి

చీపురుపల్లి: ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీరాణి ఆదేశించారు. శనివారం చీపురుపల్లి వచ్చిన ఆమె స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డులు పరిశీలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేదలంతా ఏరియా ఆస్పత్రిని ఆశ్రయిస్తుంటారని, ఈ నేపథ్యంలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. రిఫరల్ కేసుల సంఖ్యను తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.